అడవుల్లో వుండే అసలు పులి, మనుషుల్లో వుండే 'మెత్తని పులి', యీ రెండు జంతువుల్లో యేది ప్రమాదకరమైంది?

# సింహప్రసాద

# మెత్తని పులి

**వీధి అరుగుమీద బలరామయ్యగారు అవిరామంగా పచారు చేస్తున్నారు. మధ్యమధ్యన అరుగు మెట్లమీదకు వచ్చి వీధి చివరివరకూ చూస్తున్నారు. చూసి నిరాశపడుతున్నారు మళ్ళీ అంతలోనే ఆశగా ఆత్రంగా చూస్తున్నారు.**

నిజానికాయన కెంతో గాభరాగానూ ఆత్రుతగానూ ఆందోళనగానూ కూడావుంది. ఎక్కడ తను అనుకున్నట్టు జరక్కుండా పోతుందోఅని ఒకటే యిదైపోతున్నా రాయన.

"ఇకనైనా భోజనానికి లేచేది వుందా లేదా" పదోసారి అడిగిందాయన భార్య గుమ్మంలోకొచ్చి.

"మధ్యలో నీ గోలేవిటే వెళ్ళవతలికి. ఇప్పుడు భోజనం చెయ్యకపోతే కొంపలంటుకుపోతాయి కాబోలు- ఒకటే పిలవడం ప్రొద్దుట్నుంచి" విసుక్కున్నారాయన.

"ఇదేం చోద్యంరా దేవుడా. పురుము రిమి మంగలం మీన పడ్డట్టుంది వరస" సణుక్కుంటూ వెళ్ళిపోయిందావిడ.

అదేమీ పట్టించుకునే స్థితిలో లేరు బలరామయ్యగారు. ఆయన దృష్టంతా రోడ్డుమీదా, రావాల్సిన సుబ్బన్నగారి మీదావుంది.

హఠాత్తుగా ఆయన కళ్ళు మెరిశాయి. తనువు పుప్పొంగింది.

అల్లంత దూరాన సుబ్బన్నగారు వస్తూ కనిపించారు. ఆయన శరీరంలోని అణువణువూ ఏదో తెలీని ఆనందంతో పులకించి పరవశించి పోతోంటే ఎన్నడూ లేని కంగారు ఆవహించడంతో గబగబా కుర్చీలో కూలబడి పొగాకు పారం తీసి చుట్టచుట్టుకోసాగారు- తాను సుబ్బన్నగారి కోసం ఎదురు చూట్టంలేదని భ్రమకల్పించడానికి.

కొన్ని నిమిషాలు గడిచాయి. సుబ్బన్నగారు మాత్రం రాలేదు. బలరామయ్యగారి ఆందోళన అధికమయ్యింది. ఈ పాటికి రావల్సిందేనే" అనుకుంటూ మెటవరకూ వచ్చి వీధివైపు చూశారు. సుబ్బన్నగారు ప్రక్క సందులోకి మళ్ళటం కంటబడే సరికాయన గుండెలు జారిపోయాయి. ఒక్కసారే డీలాపడిపోయారు. కానంతలోనే అంతవరకూ అక్కడ తచ్చాడుతోన్న సుబ్బన్నగారు తమ ఇంటివేపు



తిరగటంతో పరమానందం కలిగింది. ఆనందాన్ని ముఖంలో కన్పించనీకుండా వెళ్ళి కుర్చీలో కూర్చున్నారు ఏమీ ఎరగనట్టు

సుబ్బన్నగారు తనింటిముందుకి వచ్చేశాడు- పలకరించకపోతే ఎక్కడాయన ఇల్లుదాటి వెళ్ళిపోతాడోనని "ఏం సుబ్బన్న మావా- ఏవిటీ ధ్య బొ తిగా నలపూసై పోయావ్" అన్నారు బలరామయ్యగారు.

"ఆఁ ఏవుందిలె. మామూలు జంఝాటా లేగా" నాన్చేశారాయన

"అరె-అక్కడే నిలబడి పోయావేం మావా- పైకి రా. చుట్ట కాలుస్తా వేమిటి లంకాకుల.... నాగుల్లంకనుంచి మా బావ మరిది పంపించాడు. ఇదిగో- ఏమేవ్ మీ బాబాయి చుట్టకాల్చుకుంటారు కాస నిప్పు తెచ్చిపెట్టు" అని కేక పెట్టారు సుబ్బన్నగారికో చుట అందిచ్చి.

బలరామయ్యగారి భార్య నిప్పుతెచ్చి గుమ్మం అవతల వుంచింది. దాంతో యిద్దరూ చుటలు వెలిగించుకున్నారు.

"ఏ మధ్యసలు బొ తిగా కన్పించడం మానేశావేం సుబ్బన్న మావా?"

"పనుల్రోజులు కదా."

"అన్నట్టు మన బ్బాయి కేదో ఇంటర్వ్యూ వచ్చిందంటేంటీ?"

"అవునల్లుడూ అబ్బాయిని హైద్రాబాదు పంపాలి."

"సరింకా చూసావేం? ఇంటర్వ్యూ కాగితంవస్తే మా దొంతులుద్యోగంవచ్చేసినట్టే. పైగా గవర్నమెంటుద్యోగం. గవర్నమెంటు సొమ్ముతినే యోగం అందరికి వస్తుందా చెప్పు? ఏదో అదృష్టంకొద్దీ మన బ్బాయి కొచ్చిందిగాని- నాలుగేళ్ళనుంచి దానికీ దీనికీ అంటూ తిరుగుతోంటె ఇన్నాళ్ళకి దేవుడు కరుణించాడు. మరి నువ్వింకా ఇలా నానుస్తూ కూర్చుంటె ఎలా మావా- నామాటిని వెంటనే నువ్వు అబ్బాయిని తీసుకుని హైద్రాబాదెళ్ళి పని పెట్టు పొద్ది.

"అంతా అలాగే అంటున్నారనుకో కాని చేతిలో తడివుంటాలిగా....!"

"దాన్దేవుంది మావా-ఎవడుబడితే వాడె యిస్తాడు నీకు ఎవడో ఎందుకూ నువ్వు వూఁ అంటే నేన ఇస్తాను. ఎంత కావాలో చెప్పు. నన్నడిగితే ఇలాటప్పుడు డబ్బు కోసం వెనకాడుండాల కూడదు అవకాశం అన్నప్పుడల్లా వస్తుందా చెప్పు? నా మాటని ఎ రెండు వేలో పట్టుకుని గోదావరి బండెక్కెయ్యండి. మన యమ్మెల్యేగార్ని కల్సుకుంటె మన పని చూడకపోడు- ఎంతైనా కులపోళ్ళంగదా. ఇంకా ఏవైనా సాయం కావాలంటె మా పెత్తోడలుడి మూడో కొడుకు, అదేంటీ — సెక్రెటరియేటో కాబోలు-పనిచేస్తున్నాడు. మంత్రులంతా అక్కడి కొస్తుంటారంట. రాజూ వాడ్ని కల్సుకుంటె సరి-పని ఇట్టే అయిపోతాది. అబ్బాయి కుద్యోగం వచ్చేస్తే నువ్వు గట్టెక్కేసినట్టేగా - ఏం సుబ్బన్న మావా?"

"అవుననుకో-కానీ...."

"నీ అనుమానాలు సంతకెళ్ళా యింక లాటిసం పెట్టుకోమాకు. మొన్నీమధ్యే మా చిన్న తోడలుడు వాళ్ళబ్బాయి కుద్యోగంకోసం యిలాగే హైదరాబాదెళ్ళి ఓ నెల్లాళ్ళుండి సాధించుకొచ్చాడు. ధైర్యంచేసి అక్కడి కెళ్ళాలిగానీ పని యిట్టే అయిపోద్దంటే నమ్మ"



"అం[illegible]తే యెత్తేసే రైటంటావా?"

"నన్నడిగితే యిప్పుడే యివాళే వెళ్ళమంటాను. మనకిన్నా ముందు యింకొకళ్ళెళ్ళి తన్నుకుపోకముందే వెళ్ళి మనం చేజిక్కించుకోవాలి. లేపోతే మరొాడు తన్నుకుపోడూ?"

సుబ్బన్నగారు ఆలోచనలో పడ్డారు. ఆయన ఆలోచన బలరామయ్యగారికి ప్రాణసంకటంగా వుంది.

"నోటు మీదో అయిదొందలుంటే యివ్వు అల్లుడూ, పంట చేతికి రాగానే తీర్చేస్తానూ."

"ఆమాత్రందానికి నువ్వు నోరుతెరిచి అడగాలా మావా-కాకితో కబురంపితే పట్టుకొచ్చి ఇవ్వనూ? అద్సరే- అయిదొందలూ ఏమూలకి చెప్పు? చార్జీలకి చాలవ్. ఇంకక్కడా ఆఫీసర్లకీ గట్రా కొద్దో గొప్పో ముట్టజెప్పాలంటే అక్కడెవరిస్తారు చెప్పు? అంచేత నామాటిని రెండువేలు పట్టుకెళ్ళు."

"అంతెందుకు లేవయ్యా."

"అమ్మమ్మ- అలా అనకు. వెధవ డబ్బుగురించికాదు—తెల్లారిలేసే వేలు గడిస్తాం- కానీ ఉద్యోగాలు ఎప్పుడుబడితే అప్పుడొస్తాయా చెప్పు? వచ్చినప్పుడే తెలివిగా వుపయోగించుకోవాలి.

ఆ పైనసలు అప్పుని అబ్బాయే తీర్చేస్తాడు నెలనెలా కొంత పంపి. అసలప్పటిదాకా ఎందుకూ? బోలుడు కట్నం వస్తుందిగా, ఏవంటావ్. ఒక వేళ మిగిత్తే తిరిగిచ్చేద్దువుగాన్లే జమకట్టేసుకుంటా" అన్నాడు.

ఆయన మౌనం వహించడంతో దాన్ని అంగీకారంగా తీసుకుని లోపలికెళ్ళి ప్రోనోటూ తెల్లకాగితమూ కలమూ పట్టుకొచ్చి "రెండు వేలకి రాసేస్తున్నాను" అన్నారు. సుబ్బన్నగారు అనుమానంగానే తలూపడం ఆలస్యం గబగబా రాసేసి సంతకాలు కూడా పెట్టించేసుకున్నారు.

ఇంతలో కోదండం రావడంతో "కాస్త సాక్షి సంతకం పారెయ్‌వోయ్" అంటూ అతడి సంతకం కూడా తీసుకుని డబ్బు తెచ్చిచ్చి "లెక్కపెట్టుకో మావా" అన్నాడు బలరామయ్యగారు.

"ఎందుకులే" అంటూ డబ్బు తీసుకుని వెళ్ళిపోయారు సుబ్బన్నగారు. అప్పుడాయన కళ్ళల్లో కదిలిన కన్నీటి చారలెవరికీ కన్పించలేదు.

బలరామయ్యగారికి పరమ సంతోషంగా వుంది.

"మొత్తానికి పడగొట్టేశారు" కోదండం అన్నాడు.

"నాదేవుందిగానీ ఆయన అవసరం అలాటిది మరి."

"నాకు తెలీదేవిటిగానీ నాకో పాతిక పారెయ్యండి."

"పాతికా?"

"లేకపోతే ముష్టివేసినట్లు మూడ్రూపాయ లిస్తారా?"

"అహ—అదికాదు కోదండం...."

"మీరీసారి పాతికిచ్చి తీరాల్సిందే. సుబ్బన్నగారు మునసబుగారింటివేపెళ్తోంటే ఆయన దొంగవడ్డీలు కడతారన్చెప్పి మీ దగ్గరకి పంపించాను."

రెండు క్షణాలపాటు ఆలోచించారాయన. కోదండంతో గొడవపట్టం మంచిది కాదన్పించింది. అతడితో అసలైన పనంతా ముందే వుందన్పించింది. వెంటనే అన్నారు "ఇరవై ఇస్తాను ఇంక నువ్వీసారికి మాటాడకు" అన్చెప్పి లోపల్నుంచి దుఃఖం తన్నుకొస్తోంటే రెండు పదులు అందిచ్చారు. వూరికే దానం చేసేస్తున్నట్టుగా వుందాయనకి!

*　　　*　　　*

ఓ రోజు సుబ్బన్నగారు పొలం వెళ్ళొస్తోంటే బలరామయ్యగారు కన్పించి పలకరించారు. ఆయనెక్కడ బాకీ సంగతి అడుగుతాడో అని ఒకటే గాభరాగా వుంది సుబ్బన్నగారికి.

'ఏం సుబ్బన్నమావా ఏవిటీవిశేషాలూ?'

"ఏంవున్నాయ్ అల్లుడూ దాళ్వావుంటే మిగిలినా మిగలకపోయినా చేతిలో పనన్నా వుండేది."

"అవునవును. అన్నట్టు మనబ్బాయికి మళ్ళీ ఇంటర్వ్యూలేం రాలేదుకదూ?"

"రాలేదయ్యా."

"అంతే మావా- ఈరోజుల్లో ఎవర్నీ నమ్మడానికి లేదనుకో. అన్నట్టు బాకీమాట మర్చిపోయినట్టున్నావ్ సుబ్బన్నమావా."

"అబ్బెబ్బే- మర్చిపోలేదయ్యా. కాస్త కాలూ చెయ్యీ కూడదీసుకోగానే...."

"అమ్మమ్మ వూరికేలడిగే న్నప్ప కంగారేం లేదు. నీ బాకీ ఎక్కడికిపోద్ది చెప్పు? అది సరేగాని సుబ్బన్నమావా నువ్వేమీ అనుకోనంటే ఓమాట చెప్పాలనుంది."

"దేని సంగతి?"

"మన బాకీ సంగతే. ఇప్పటికే మీరు తీసుకున్న అప్పు అయిదువేల అయిదువందల వరకూ వుంది. ఇక మూడున్నర రూపాయల వడ్డీ గనుక రాత్రీ పగలూ పెరుగుతూనే వుంటుందికద? అంచేత ఆ వడ్డీలవీ ఎప్పుడో తీర్చేనాటికి తడిసి మోపుడవుతాయ్. అంచేత అయితే అయ్యిందని ఒక ఎకరం పొలం అమ్మేస్తే అవతల అప్పూ తీరుతుంది ఇవతల మన శ్శాంతిగానూ వుంటుంది. ఈ రోజుల్లో పొలం మీదెంత మిగుల్తోందో మనం చూస్తూనే వున్నాంగా. ఆ వడ్డీల్తో అవస్థపడేకన్నా ఇలా చేస్తే బావుంటుందని నా సలహా. ఆ తర్వాత మీ ఇష్టం. వస్తాను మావా."

బలరామయ్యగా రెళ్ళిపోయారు ఆలోచనల అగ్గిపుల్లని వెలిగించి.

సుబ్బన్నగారు తీవ్రంగా ఆలోచించారు. ఇంట్లోకూడా చెప్పేరు. పొలం అమ్మడం మంచిపని కాదన్నారు ఇంట్లో అంతా. కాని ఎకరంమీద వచ్చే పంటనీ అప్పుకయ్యే వడ్డీనీ బేరీజువేసి చూస్తే అమ్మెయ్యడమే మంచిదన్పించింది. పైగా అప్పు కేన్సర్‌లాటిది. కేన్సర్ సోకిన భాగాన్ని తొలగించకపోతే అది మిగిలిన భాగాల్నికూడా చుట్టిముట్టేస్తుంది! దానికి తోడు దరిదాపుల్లో తాను అప్పుతీర్చగల పరిస్థితేమీ కన్పించడంలేదు!

ఆఖరికి ఒక ఎకరం పొలం అమ్మి ఋణ విముక్తుడు కావడానికే నిర్ణయించుకున్నారు సుబ్బన్నగారు. ఆ నిర్ణయం బాధ కలిగిస్తోన్నా మరో గత్యంతరం కన్పించడం లేదాయనకి. దానికి తోడింకో ఆశ కూడా పీకుతోంది. కాలేజీ చదువు చదివిన కొడుకు వుద్యోగం సద్యోగం లేక యింట్లోనే వున్నాడు. ఇదివరకు యింటర్వ్యూ వచ్చినప్పుడు హైదరాబాదెళ్ళి మోసపోయినా, అక్కడ కొన్నాళ్ళుపాటుంటే ఏదో వుద్యోగం వసుందని అంతా అనడమేగాక ఆయనకొడుకూ అంటున్నాడు. ఓ వెయ్యి రూపాయలిత్తి పంపిసే వెంటనే గాకపోయినా రెండు మూడు నెలల్లో యేదోటి రాకపోదు అంత

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
—శస్త్రచికిత్స
అవసరములేదు!

చదువు చదివినందుకని కొంచెం ఆశగా కూడా వుంది.

అలా నిర్ణయాని కొచ్చేక తన అభిప్రాయాన్ని సూచాయగా వాకాయన్తో అన్నారు సుబ్బన్నగారు. దాన్తో సుబ్బన్నగారు యెకరంపొలం బేరం పెట్టేశారని వూరంతా యిదిగా చెప్పుకోవడమేకాదు కొందరొచ్చి బేరమాడారు కూడా.

మొదటి సారిగా కోదండం వచ్చాడు.

"సుబ్బన్న బాబాయ్! ఎకరం పొలం బేరం పెట్టావంటేమిటీ?"

"అవున్రా" ఎంచేతో ఇదిగా ఫీలయ్యారు సుబ్బన్నగారు.

"మన పక్కూరి నాంచారయ్యగారడగమన్నారే. అయిదు వేలకాయమధ్యేవరో ఎకరం అమ్మేర్ట. ఆ రేటు చొప్పునిస్తానంటున్నారు...."

అదిరిపోయారు సుబ్బన్నగారు....

"పన్నెండు వేలు చేసే బంగారం లాంటి పొలం అయిదువేల కడిగారా?"

"నువ్వెక్కడో పూర్వం రేటు చెబుతున్నావ్ బాబాయ్ ఈ మధ్యసలు పొలాలు కొనేవాళ్ళే కన్పించడం లేదుగా. ల్యాండ్ సీలింగ్ ధర్మమా అని! అయిదు వేలంటే అయిదువేలే కాదనుకో ఓ రెండు మూడొందలు అటూ ఇటూలో- వూ అనేసైతే ముందు నాకు చెప్పు బాబాయ్" అనేసి వెళ్ళిపోయాడు కోదండం.

ఎంత పొలం బేరం పెడితే మాత్రం మరీ ఇంత దారుణమా? అనుకున్నారు సుబ్బన్నగారు కాని ఆ మర్నాడు మరొకతనొచ్చి నాలుగువేలకి అడగడంతో ఆయన ఆశ్చర్యంతో ప్రమాన్పడిపోయారు.అయినా బింకం సడలకుండా "పదివేలకి పైసా తక్కువైతే అమ్మనండీ" అన్నారు.

మరో వారంరోజుల్లో ఇంకో నలుగురు ముగ్గురు మధ్యవర్తులొచ్చి అడిగారు. చిత్రమేమిటంటే అంతా అయిదువేలకీ అంతకె తక్కువకీ అడిగారుగాని ఒక్కళ్ళూ అయిదువేలని మించి ఒక్క రూపాయి పెట్టలేదు!

సుబ్బన్నగారికి నిజంగానే మతి పోయినట్లుగావుంది వస్తోన్న బేరాలనిచూస్తోంటే. అంత ఖరీదైన పొలాన్ని. కంత తీసే చాలు కాలువలోని నీళ్ళొచ్చిపడే పొలాన్ని అయినకాడికి అడగటం మహా దారుణ మన్పించింది. పొలం అమ్మకం మానేస్తే బావుణ్ణనీ అన్పించింది. కాని అదే సమయంలో భూసంస్కరణల గొడవవల్లా పంటలు దెబ్బ తినడంతోనూ పొలాలు కొనేవాళ్ళు తక్కువవడంవల్లా పొలాలమ్మే సన్నకారు రైతులు రోజురోజుకీ ఎక్కువవుతూండటంవల్లా ఇంకొన్నాళ్ళు పోతే ఆ రేటుకైనా కొనేవాళ్ళుండరేమోనని భయం పట్టుకుంది. ఏం చేయాలో పాలుపోక సతమత మవుతోంటే బలరామయ్యగారు కబురంపారోసారి రమ్మని. బాకీ సంగతి అడగటానికా-బోల్లా దేవుడా అనుకుంటూ ఇదవుతూ వెళ్ళారు సుబ్బన్నగారు.

కాని ఆయన సుబ్బన్నగార్ని ఎంతో ఇదిగా ఆహ్వానించి మర్యాద కూడా చేసేసరికి సుబ్బన్నగారికి మతిపోయినంత పనయ్యింది.

కులాసా కబుర్లయ్యాక బలరామయ్యగారన్నారు "అదృరేగాని సుబ్బన్న మావా- నువ్వేదో పొలం బేరం పెట్టేవంటేమిటీ."

"అవునల్లుడూ - నువ్వోసారన్నట్టూ పొలం అమ్మి అప్పు తీర్చెయ్యడవే మంచిదనుకుని ఓ ఎకరం బేరం పెట్టాను."

"ఏమైనా కుదిరిందేమిటి?"

"ఇంకా లేదు-ఏవో బేరాలొస్తున్నాయ్"

"నేను అప్పిచ్చి అడుకున్నానని అడగటంకాదుకాని ఆరువేలు చేసిస్తే నే తీసుకుంటాను. ఎలాగూ నాకే బాకీ వున్నావని, అదీ అదీ సరిపోతుందని అడుగుతున్నా నప్ప నాకింకో వుద్దేశ్యం లేదంటే నమ్ము."

సుబ్బన్నగారికి కొంచెం సంతోషం వేసింది ఆరు వేలనడంతో. ఎంచేతంటే ఇంతవరకూ వచ్చిన బేరాల్లో ఇదే పెద్దది. అందరూ అంతకు తక్కువే అడుగుతున్నారని తెలిస్తే ఆయనా తక్కువకే అడుగుతాడని భయం కూడా వేసింది. అయినా వెంటనే ఒప్పేసుకోవడం మంచిది కాదనుకుని. "ఆమధ్య ఆ ప్రక్క పొలం పన్నెండు వేలు చేసి కొన్న సంగతి నీకు తెలుసుగా అల్లుడూ" అన్నారు సుబ్బన్నగారు.

అప్పట్లో అంత రేటొచ్చిన మాట నిజమేగానీ ఈ సీలింగులొచ్చేక మాలాటి వాళ్ళం భూమి కొనడానికే జడుస్తున్నాం. ఎప్పుడు ప్రభుత్వంవారు భూముల్లాగేసుకుంటారో అని. అంచేతే ప్రతీ చోటా రేట్లు పడిపోయాయ్. అయినా కొనేవాళ్ళు దొరకడమేలేదు కదా"

"ఇంకో అయిదొందలు కట్టుకుని నీ మాట ప్రకారమే కానియ్ అల్లుడూ."

"అమ్మమ్మ అలా అనకు. అక్కడికే ఎక్కువ పెట్టాను. పోనీలే పెదోడివి అడిగావుగనుక ఆ పైన రెండొందలుకట్టుకో. నాకు బోల్లు స్టాంపుల ఖర్చువుద్ది కూడానూ. ఈ మధ్య ఆ ఖర్చుని చాలా పెంచేశారు కదా" అన్నారు. అనడమేకాదు వెంటనే ఒప్పందం కుదిరిపోయింది కూడానూ.

మొతానికి రేటు బాగానే కిట్టిందని సంతోషిస్తోన్న సుబ్బన్నగారు ఎకరం పొలం అమ్మినా ఇంకా బలరామయ్యగారికి రెండు వేలు బాకీ వున్నారన్న సంగతి తెలిసేసరికి కుప్పలా కూలిపోయారు దిక్కుతోచక!

## ఔను నిజం

మెక్సికోలో అలామోస్ అనే చోట జైలులోంచి నేరస్థులు కనుక తప్పించుకొని పారిపోతే వారి శిక్షాకాలాన్ని డ్యూటీలో వున్న సెంట్రీ అనుభవించి తీరాల్సిందే.

